క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణామాచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య అలివేలు మంగాసమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాలను రథంపై కూర్చుండబెట్టి ఊరేగింపు నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

కడ్తాల్: కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో పదోతరగతి పరీక్షలు మంగళవారం(రెండో రోజు) ప్రశాంతంగా జరిగాయి. కడ్తాల్‌-ఏ సెంటర్‌లో 220 మంది విద్యార్థులకు 218 మంది హాజరుకాగ, బీసెంటర్‌లో 194 మందికి 194 మంది హాజరయ్యారు. ముద్విన్ పరీక్ష కేంద్రంలో 95 మందికి 95 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మండలంలో మొత్తం 509 మంది విద్యార్థులకు గాను 507 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ సర్దార్ తెలిపారు. అదే విధంగా ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 280 మందికి 279 మంది హాజరుకాగ, బాలుర ఉన్నత పాఠశాలలో 274 మందికి 274 మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం మండలంలో 554 మందికి 553 మంది పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన తలకొండపల్లి, వెల్జాల్ పరీక్షా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదోతరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో 254 మందికి 253, వెల్జాల్ పరీక్షా కేంద్రంలో 102 మందికి గాను 100 మంది పరీక్ష రాసినట్లు ఛీఫ్ సూపరింటెండెంట్‌లు పర్వతాలు, రామనాథం తెలిపారు. వెల్జాల్ పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీకాంత్ సందర్శించారు.

ప్రీతంకు శుభాకాంక్షలు



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానించిన నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగరి ప్రీతంను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీశైలం కలిశారు. ప్రీతంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రీతంను కలిసిన నాయకులు..

కడ్తాల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగరి ప్రీతంను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ బ్లాక్ అధ్యక్షుడు రామకృష్ణ మంగళవారం కలిశారు. ప్రీతంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, డిగ్రీ కృష్ణ, శంకర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషిచేయండి..

తలకొండపల్లి: దళితుల అభ్యున్నతికి కృషిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ.. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతంను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని చెంగిచెర్లలో ప్రీతంను ఆయన నివాసంలో కృష్ణ కలిసి ఘనంగా సత్కరించారు.

షూటింగ్ విభాగంలో విద్యార్థినికి బంగారు పతకం



క్రితిమిశ్రాను సన్మానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఆగ్రాలో ఇటీవల జరిగిన పదవ వరల్డ్ క్రాస్బో షూటింగ్ ఛాంపియన్ షిప్‌-2023 పోటీలో వనస్థలిపురానికి చెందిన విద్యార్థిని క్రితి మిశ్రా బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా క్రితి మిశ్రా మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. ఎమ్మెల్యే ఆమెను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పలు దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విశేష ప్రతిభ ప్రదర్శించి క్రితి మిశ్రా బంగారు పతకం సాధించడం మన తెలంగాణ రాష్ట్రానికి గర్వించదగ్గ విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఆమె సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రితి మిశ్రా తల్లిదండ్రులు సునీత, రాధేశ్యామ్, నాయకులు దూసరి మధుగౌడ్, రాజి రెడ్డి, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నామ్ కే వాస్తే

- యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లోకి రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపటంపై కండక్టర్ల నిరాసక్తత
- మహిళలకు ఉచిత ప్రయాణంతో సీట్లు లేక పురుష ప్రయాణికుల అవస్థలు
- సమస్య పరిష్కరించాలంటూ ఫిర్యాదులు



యాచారం ఆర్టీసీ బస్టాండ్

యాచారం: నాగార్జునసాగర్‌–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లోకి నల్లగొండ జిల్లా దేవరకొండ డిపో బస్సులు రావడంలేదు. ఇన్నాళ్లు అయితే యాచారం బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో ప్రధాన రోడ్డుపై రాకపోకలు సాగించే బస్సులు ఎక్కడ నిలుపుతాయో.. ఎక్కడ ప్రయాణికులను ఎక్కించుకుంటాయో అర్థం అయ్యేది కాదు. అయితే ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న యాచారం బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు వాడుకలోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో రద్దీ అధికమైంది. సాగర్ రోడ్డుపై యాచారం, మాల్, గునుగల్ కేంద్రాల నుంచి నిత్యం మహానగరానికి 5 వేల నుంచి 10వేల మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు బస్సుల్లో రాకపోకలు సాగిస్తారు. మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మహిళల రద్దీ ఎక్కువవడంతో చేయి ఎత్తిన చోట బస్సులు ఆపడం లేదు. ఇక్కడి బస్టాండ్ పరిస్థి తి నామ్‌కే వాస్తే అన్న చందంగా తయారయ్యింది.

బస్టాండ్‌లోకి రాని బస్సులు..

మహిళలకు ఉచిత ప్రయాణంతో నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు దేవరకొండ డిపో నుంచే ఫుల్‌గా వస్తున్నాయి. మాల్ కేంద్రానికి వచ్చే సరికి బస్సు ఫుట్‌పాత్ మెట్లపై కాలు పెట్టలేనంతగా ఉంటోంది. ఈ క్రమంలో యాచారంలో ప్రయాణికులు దిగాల్సి ఉన్నప్పటికీ బస్సులు ఆపడం లేదు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, బీఎన్‌రెడ్డినగర్, సాగర్ రింగ్ రోడ్డులలోనే ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుతున్నారు. నగరంలో యాచారం ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కితే యాచారంలో నోస్టాప్.. మాల్ లేదా మల్లేపల్లి, దేవరకొండ కేంద్రాల్లోనే నిలుపుతామని కండక్టర్లు ప్రయాణికులకు తెగేసి చెబుతున్నారు. దీంతో ప్రయాణికులకు కండక్టర్లకు ఘర్షణ, వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి.

టికెట్ ఉన్నా నిలబడాల్సిందే..

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటంతో పురుష ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. సాగర్ రోడ్డు వద్ద డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కితే రూ.వందకుపైగా చార్జి అవుతుంది. అప్పటికే బస్సుల్లో మహిళలు ఫుల్‌గా ఉంటున్నారు. యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి నిత్యం 2వేలకు పైగా పురుష ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారు. ఉదయం 6 గంటలకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తమ పనులు పూర్తిచేసుకుని సాయంత్రం 6 తర్వాత మళ్లీ ఇళ్లకు బస్సుల్లో వస్తారు. చార్జీలు చెల్లించినా సీట్లు లేకపోవడంతో నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి. టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు సీట్లు కేటాయించేలా ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నిలబడే ప్రయాణం



బస్సులో నిత్యం నిలబడి ప్రయాణం చేస్తున్నాం. పిల్లల చదువు దృష్ట్యా మూడు నెలల కింద తుర్కయంజాల్‌కు వెళ్లాం. వృత్తి రీత్యా యాచారానికి ఉదయం 9 గంటలకు వచ్చి రాత్రి 8 గంటల తర్వాత బస్సులోనే పోతాను. నెల రోజుల్లో ఏరోజు కూడా నాకు సీటు దొరకలేదు.

– మహేష్‌కుమార్, వ్యాపారి, యాచారం

చేయి ఎత్తినా ఆపడం లేదు



యాచారం ఆర్టీసీ డిపో వద్ద ఉండి చేయిఎత్తినా డీవీకే ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. ఎప్పుడో ఒకసారి ఎదో ఒక డీవీకే బస్సు బస్టాండ్‌లోకి వస్తున్నాయి. పలుమార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశాను. ఎలాంటి ఫలితం లేదు.

– రవి, ఉపాధ్యాయుడు, యాచారం

చర్యలు తీసుకుంటాం



యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లోకి సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి బస్సు వచ్చిపోయేలా కృషి చేస్తా. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుపోయి ప్రతి డీవీకే బస్సును యాచారం బస్టాండ్‌కు వచ్చిపోయేలా చూడాలని ఆ డిపో అధికారులకు తెలియజేస్తాను.

– వెంకట నర్సప్ప, మేనేజర్, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

భూ సమస్యలు పరిష్కరించండి

కోదండరెడ్డికి సాలార్‌పూర్ గ్రామస్తుల వినతి



కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సాలార్‌పూర్ గ్రామస్తులు

కడ్తాల్: గ్రామంలోని భూములకు రిజిస్ట్రేషన్ కావడం లేదని వెంటనే సమస్య పరిష్కరించి వాటి క్రయవిక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సాలార్‌పూర్ గ్రామస్తులు మంగళవారం ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డిని కలిసి విన్నవించారు. భూసమస్యలపై వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తాతల కాలం నుంచి గ్రామంలోని భూములకు సంబంధించి తమకు పట్టాలు ఉన్నాయని, రిజిస్ట్రేషన్లు కూడా జరిగేవని.. ఏడాదిన్నర క్రితం గ్రామానికి చెందిన భూములు గెజిట్‌లో వక్ఫ్‌బోర్డులో నమోదయ్యాని దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. దీంతో ఏడాదిన్నర కాలంగా సాలార్‌పూర్ గ్రామంలోని భూముల రిజిస్ట్రేషన్స్ జరగడం లేదని, క్రయ విక్రయాలు నిలిచిపోయాయని వివరించారు. సాలార్‌పూర్ గ్రామంలోని భూములకు సంబంధించి కోర్టు కూడా పట్టా భూములేనని ఇటీవలే ఆర్డర్ జారీచేసినా స్థానిక రెవెన్యూ అధికారులు కోర్టు ఆర్డర్‌ను అమలు చేయడం లేదని వాపోయారు. వెంటనే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. స్పందించిన కోదండరెడ్డి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు యాదగిరిరెడ్డి, శంకర్, ప్రకాష్‌నాయక్, హరి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రండి

ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వానం



ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో మార్చి 26న రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ నిర్వాహకులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగరుకర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజిసింగ్‌ను వారి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాం, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, డేవిడ్, మహేశ్, దామోదర్, ప్రవీణ్ కుమార్, కుమార్, మల్లేష్, గణేషు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన లాలు (61) అనారోగ్యానికి గురై మృతిచెందాడు. శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజు, శంకర్, చందు, గోపాల్, చంటి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పెద్దూర్ తండాలో శంకర్ (59) మృతి చెందాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, రవీందర్, చందు, హీరాలాల్, బాలు, రవి, రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషకాహారం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శబరి, సరళాదేవి, కవిత



కడ్తాల్: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కడ్తాల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శబరి, సరళాదేవి అన్నారు. మండల పరిధిలోని ముద్విన్, రావిచేడ్, మద్దెలకుంట తండా అంగన్‌వాడీల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రకరకాల చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా లభిస్తుందో వివరించారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అదే విధంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు సునీత, కిష్టమ్మ, హంస పద్మ, సుజాత, నస్రీన్, సువర్ణ, కిశోర బాలికలు, విద్యార్థుల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

చెన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో..

తలకొండపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. మండల పరిధిలోని చెన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషక పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకుకూరలు, కాయగూరలతో పోషక ఆహారాన్ని తయారుచేసి ప్రదర్శించారు. అనంతరం కవిత మాట్లాడారు. విటమిన్లు, ప్రొటీన్లు, మిలెట్స్ తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్లెతై ఆరోగ్యం పదిలంగా ఉండడమే గాకుండా వాధ్యులు మన దరిచేరవన్నారు. బిడ్డలు ఆరోగ్యంగా పుట్టడానికి పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడడమే గాకుండా బిడ్డ త్వరగా ఎదిగే అవకాశముంటుందన్నారు. మన దైనందిన జీవితంలో తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహార పదార్థాలుగా తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. చిరు ధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమమంలో అంగన్‌వాడీ టీచర్లు అనంతమ్మ, గర్భిణులు, బాలింతలు, మహిళలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావొద్దు



మంచాల: ఆరుట్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజ్



ఇబ్రహీంపట్నం: పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకుంటున్న సీఐ సత్యనారాయణ

మంచాల: ఓటుహక్కును ప్రజలు నిర్భయంగా వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం ప్రజలకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దని తెలిపారు. చట్టబద్ధంగా కల్పించిన హక్కులను వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సీఐ బాబ్యానాయక్, ఏఎస్ఐ సతీష్, ఎంపీటీసీ సభ్యుడు చీరాల రమేష్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సీఐ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. రాయపోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారో తెలుసుకొని..ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టాలో ఆయన పరిశీలించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఎస్ఐ మారయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

24న పిచ్చుకగూళ్లు, నీటితొట్ల పంపిణీ

ఎల్‌బీనగర్: ఎండ కాలంలో మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు కాలనీల్లో నీటితొట్లతో పాటు పిచ్చుక గూళ్లు, వాటి ఆహారం కోసం కొర్రలు, సజ్జలు, రాగులు తదితర గింజలను ఈ నెల 24న పంపిణీ చేస్తామని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, పర్యావరణ వేత్త సూర్యకుమారి, గద్దె విజయ్‌నేత మంగళవారం తెలిపారు. మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం, 24న సెలవు దినం కావడంతో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలోని విప్ర సేవా సమితి పక్కన గల ఊ స్కూల్ వద్ద పిచ్చుక గూళ్లు, నీటి తొట్టెలను పంపిణీ చేస్తామన్నారు. ఆయా కాలనీల ప్రజలు వచ్చి పిచ్చుకగూళ్లు, ఆహార తొట్టెలను తీసుకోవచ్చన్నారు. తీసుకున్న వారు కాలనీలో ఏర్పాటు చేసి ప్రతి రోజూ పక్షులకు నీళ్లు, ఆహారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోరాట యోధురాలు 'మల్లు'



యాచారం: మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషిచేస్తామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ అన్నారు. మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, పార్టీ నాయకులు సత్యనారాయణ, భాస్కర్, శంకరయ్య, ఆశీర్వాదం, యాదగిరి, విజయ్, యాదయ్య, వెంకటకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమె ఆశయ సాధనకు కృషి..

ఇబ్రహీంపట్నం: మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మల్లు స్వరాజ్యం పేదలకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, బుగ్గరాములు, నర్సింహ, గణేశ్, జగన్, శ్రీకాంత్, షఫీ ఉన్నిసా, స్వప్న, దశరథ, యాదగిరి, గణేశ్ పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం యువతకు ఆదర్శం అని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. యాచారంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, మండల కార్యదర్శివర్గ సభ్యులు అంజయ్య, బ్రహ్మయ్య, చందునాయక్, జంగయ్య, మండల కమిటీ సభ్యులు వెంకటయ్య, వినోద్‌కుమార్, తావునాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల సీపీఎం కార్యాలయంలో..

మంచాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజు, లెనిన్, రజాక్ పాష, యాదయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



తుర్కయంజాల్: మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మాడ్గుల తహసీల్దార్‌గా సునీల్



మాడ్గుల: మాడ్గుల మండల నూతన తహసీల్దార్‌గా సునీల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నిరంజన్‌రావు బదిలీపై సీసీఎల్ఏకు వెళ్లగా రంగారెడ్డి జిల్లా కందుకూర్ ఆర్డీఓ ఆఫీస్‌లో డీపీఓగా విధులు నిర్వహిస్తున్న సునీల్‌ను రెండు రోజులు కిందట మాడ్గుల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సునీల్‌ను తహసీల్దార్ కార్యలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

బీజేపీదే గెలుపు

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీదే గెలుపు అని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ పేర్కొన్నారు. బడంగ్‌పేట్‌లో జరిగిన మహేశ్వరం నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి మంగళవారం ఆయన మామిడిపల్లి నుంచి కార్యకర్తలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం విశ్వనాథ్ గౌడ్ మాట్లాడుతూ గడిచిన పదేళ్లల్లో దేశానికి సుస్థిర పాలన అందించిన మోదీకే ప్రజలు పట్టం గడుతారన్నారు. తెలంగాణలో కూడా మెజార్టీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వాహనాల అక్రమ పార్కింగ్‌ను సహించం

- రోడ్లు, వైన్స్, హోటళ్ల ఎదుట పార్కింగ్ చేసే వారిపై కఠిన చర్యలు
- వనస్థలిరపురం ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు

హస్తినాపురం: జాతీయ రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైన, వైన్‌షాపులు, హోటళ్ల ముందు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం వనస్థలిపురంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ విజయవాడ, నాగార్జున సాగర్ రహదారులపై ఎక్కడి పడితే అక్కడ తమ ఇష్టానుసారంగా వాహనాలను నిలుపుతున్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని, వాహనాలకు జరిమానాలు విధిస్తామని అన్నారు. విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఎక్కడపడితే అక్కడ వాహనాలను యూటర్న్ చేయవద్దని ఆయన వాహనదారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో డివైడర్ల మధ్య నుంచి వెళ్తున్నారని, అలా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద మాత్రమే వాహనాలను మళ్లించాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. రహదారులపై ఉన్న హోటళ్లు, వ్యాపార సముదాయాలు , వైన్ షాపులు , బార్‌ల వద్ద విధిగా వాహనాల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జంబ్లింగ్ పద్ధతిలో డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారి వాహనాన్ని సీజ్ కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం'

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మీర్‌పేట మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ అధికారంలోకొచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎంపీ టికెట్ ఎవరికి కేటాయించినా కాంగ్రెస్ గెలుపు కోసం అందరూ కలసి కట్టుగా పనిచేద్దామన్నారు.